కథా నిలయం
2057
శ్రీకాకుళం

వివాహంలో కలహం

ఉదయ పవనాలు చల్లగా వీస్తున్నాయి.

శేఖరం మగత నిద్రలో మంచంమీద దొర్లాడు.

తూతూ బాకాలు, బాజా భజంత్రీల రొదలు కలలో. కలలోంచి చెవుల్లో గింగురుమంటున్నాయి.

గుండె వేగంగా కొట్టుకుంటోంది. తలతిరిగింది- పెళ్ళి పందిరిలోంచి బయటికి వచ్చేశాడు. ఆ కంగారులో వీధి గుమ్మం తలకి తగిలింది. మెళుకువ వచ్చింది.

బద్ధకంగాలేచి కూర్చున్నాడు దురదృష్టకరమైన దినాలన్నిటిలో యీరోజు ముఖ్యమైంది అనుకున్నాడు శేఖరం.

కాలకృత్యాలు తీర్చుకుని, కాఫీ త్రాగి, మనసులోని బాధలు తెలియకుండా మామూలుగా ముస్తాబయి కొన్న పెళ్ళికానుక చేతిలో పెట్టుకుని వీధిగుమ్మం వైపు నడిచాడు.

గుమ్మందగ్గర ఎదురుగా సత్యవతి ప్రత్యక్షమయింది. శేఖరం ఆశ్చర్యపోయాడు.

ఎక్కడి సత్యవతి ! ఎందుకు వచ్చింది ! ముఖ్యంగా మనస్సు బాగులేని యీ సమయంలో- శేఖరం ఆవేదనతో అలజడి చెందాడు.

ఒకరూ మాట్లాడలేక మౌనంగా నిలుచున్నారు ఒక నిమిషం.

“ఎక్కడినుంచి యీ రాక ?”

శేఖరం పలకరించాడు

“నీ కోసం... నేను ఉండలేకపోయాను. యింటిదగ్గర ఎన్నాళ్ళు యీ బాధలు భరించడం... రెండేళ్ళు గడిచి పోయాయి నిన్ను చూచి !

“నీ ఉ...ద్దేశ్యం నాకు బోధపడటంలేదు. నాపరిస్థితి అంతా నీకు ఏనాడో చెప్పాను...యిలా పారిపోయివస్తే... మీ వాళ్ళు ఏమనుకుంటారు ?”

"ఏమన్నా అనుకోనీ... నేను నీ పాదాలదగ్గరే ఉండి పోతా..." సత్యవతి అమాంతంగా పెల్లుబికి ఏడ్చి, చేతిలోని బట్టలసంచీ క్రిందకు జారవిడిచి, శేఖరం పాదాలమీద వాలి పోయింది.

శేఖరానికి మానసిక సంఘర్షణ మరింత హెచ్చింది.

ఆశించిన వనితకు వివాహమవుతోంది.

ఆశించని వనిత తన్ను వెన్నంటింది.

"నువ్వు యిలా రావడం నాకిష్టంలేదు... తిరిగి వెళ్ళిపో మీ యింటికి" శేఖరం మొండిగా కూకలేశాడు.

"మీకోసం... అన్నీ తెగించి- యిలావస్తే... యిదేనా మాట్లాడడం... మీ హృదయంలో కనికరంలేదా మిమ్మల్ని చూసినప్పటినుంచి..." సత్యవతి రోదనస్థాయి పెరిగింది.

శేఖరంకు చికాకు హెచ్చయింది.

"నేను పనిమీద వెళ్ళిపోతున్నాను...ఆ తర్వాత నీయిష్టం" శేఖరం ఒకడుగు ముందుకు వేశాడు.

"బ్రతిమాలుతున్నా మిమ్మల్ని ఉండమని... నేను యింటికివస్తే మీరు వెళ్ళిపోతారా. ఇది న్యాయమేనా...!"

"క్షమించు సత్యవతీ... నేను నీతో మాట్లాడే స్థితిలో లేను..." శేఖరం తలుపులు తెరిచి, యిల్లు సత్యవతికి వదిలేసి వేగంగా నడిచి రోడ్డుమీదకు వచ్చాడు.

ఇంటి దాసి పనులు పూర్తిచేసుకుని మూలగా ఏడుస్తూ కూర్చున్న సత్యవతివైపు వింతగా జాలిగాజూసింది.

"మీరుంటారా అమ్మ ... తాళం యిదిగో"

అందిచ్చి దాసి నిష్క్రమించింది.

ఆ నిర్జనగృహం తలుపులు బంధించింది సత్యవతి. కాళ్ళీడ్చుకుంటూ పడక గదిలో చాపమీదకువాలి ఒరిగి ఏడ్చింది. "ఏమిటి మనస్తత్వం" మథనపడింది సత్యవతి

"సత్యవతీ! నువ్వంటే నాకు ఎంతో జాలి... నీ జీవితం చూస్తోంటే గుండె తరుక్కుపోతుంది ... నాకే దైవం శక్తి యిస్తే నీలాంటి అబలను జీవితమంతా కాపాడుతాను" శేఖరం అన్నమాటలు సత్యవతి నెమరువేసుకుంది.

ఆనాడు తన యింటిలో వరండాలో వెన్నెల వెలుగుల్లో తన తల్లిముందు వితంతువుల కష్టాలగూర్చి చెబుతూ శేఖరం అన్నమాటలు సత్యంకాదేమో అని అనుమాన పడింది. తల్లిని విడిచి తమ్ముడిని లెక్కచేయక, అతని కోసంవస్తే, తనకేమీ తెలియని వనిత ఎవరో వచ్చినట్లు చూస్తే ఏమనుకోవాలి ...

"ఎప్పుడైనా మా వూరు రా... నీకు స్వాగతం!" అన్న గంభీరమైన శేఖరం మాటలు ఏమైపోయాయి.

శేఖరం చూపులో ఆత్మీయత, జాలి కనిపించడం లేదు.

ఏదో పిచ్చి, ఆవేదన వ్యక్తమవుతున్నాయి.

'తన్ను శేఖరం ప్రేమించలేదు. కాని శేఖరాన్ని వదలలేని అభిమానం పెంచుకుంది తను' సత్యవతి కళ్ళు చెమ్మగిల్లాయి. ఉబికివచ్చే దుఃఖంతో గట్టిగా ఏడ్చింది.

శేఖరానికి ఏర్పడిన సన్నివేశం గందరగోళంగా ఉంది. తలలో ఏవో అగ్నిగోళాలు బద్దలవుతున్నాయి.

"చదువులేని పల్లెటూరి సత్యవతి... మొండి... చెపితే అర్థంకాదు... మోటు అభిమానం... తన్ను ఎందరో అభిమానించారు... కాని తనకు స్నేహభావం తప్ప మరొకటి లేదే!" శేఖరం తనలో తర్కించుకున్నాడు.

బస్సు ఎక్కి, ఆగినచోట దిగి, రిక్షాఎక్కి, పెళ్ళిపందిర చేరాడు శేఖరం ... యంత్రంలా నడిచాడు ... పెళ్ళిపందిర హడావిడిగా ఉంది. పెళ్ళివారు వచ్చే అతిథులకు... స్వాగతం చెప్పారు. అందరితోపాటు శేఖరానికి-ఆమెతప్ప ఎవరూ తనకు తెలియదు ... ఆమెకు వివాహమవుతోంది. తెచ్చిన పెళ్ళికానుక స్వాగతం చెప్పిన తెలియనివ్యక్తి చేతిలో

జార్చాడు... మౌనంగాపోయి కుర్చీలో కూర్చున్నాడు. పెళ్ళిపందిరకు వేలాడుతున్న మామిడి తోరణాలు కంటి ముందు భూతవైద్యుని వేపకొమ్మల్లా ఆడుతున్నాయి. తూతూబాకాలు, బాజాలు, గుండెల్లో మారు మోగు తున్నాయి. పందిరకు వేలాడే కాగితంరంగు బుట్టలు గిరున తిరుగుతూ వూగుతున్నాయి. సముద్రంమధ్య సుడిగుండంలోని పడవలా... మంత్రాల ఉచ్చారణలు మన స్సులో దిమ్మ ఎక్కువ చేస్తున్నాయి. ఎవరో ఎరుగున్న వారు శేఖరానికి నమస్కరించారు. యాంత్రికంగా చెయ్యెత్తి అభి నందన చెప్పాడు. శేఖరం-లేచాడు ఏదో ఆలోచనతో పెళ్ళి పూర్తి కాకుండానే...నడుస్తున్న అతని చేతిలో తాంబూలం పెట్టారు, పెళ్ళివారు. మతిచెడిన వాడిలా బయటికివచ్చేశాడు శేఖరం ఎదురుగా బిచ్చగాడు అరిచాడు...

"బాబయ్యా... తమ దయ!"

చేతిలోని తాంబూలం ముష్టివాడిగిన్నెలో వేశాడు శేఖరం. బిచ్చగాడు అరటిపండు తింటూ వెళ్ళిపోయాడు.

ఆనాటితో మూడుసంవత్సరాలు గడిచాయి. మొగ్గగా లేచిన వూహ, విచ్చుకున్న ఆశ, పువ్వులా పరిణమించినలోని ప్రేమ, నేడు వాడిపోయి, రాలిపోయాయి.

'నిన్ను పెళ్ళిచేసుకోవాలనుంది.' అన్న శేఖరం మాటలకు 'నానుంచి ఏమీ ఆశించకండి' అంటూ ఆమె పక

పక నవ్వింది. ఆ నవ్వు ప్రతిధ్వనించింది. అతని గుండె గోడలు తాకి బెల్లులు పూడకొట్టింది, ఇప్పటికీ ఆ నవ్వు గుండెల్లో ప్రతిధ్వనిస్తోంది.

'స్త్రీ కోరిక ఏమిటి? ఎందుకు పురుషుణ్ణి నిరాకరిస్తుంది పిరికితనం, హోదా లేమి, దారిద్ర్యం, తెలివితక్కువ-ఇవన్నీ కారణాలు కావచ్చు, స్త్రీ పురుషుణ్ణి చులకనగా చూడటానికి ... కాని శేఖరంలో యిదేమీ లేదే! కాని ఆమె నిరాకరించింది శేఖరాన్ని. అనుకోని ఆ సంఘటన శేఖరం దర్పానికి ఒక గొడ్డలి పెట్టు.

ఒకప్పుడు శేఖరం పెళ్ళిచూపులకు వెడితే మర్నాడు పెళ్ళికూతురు తండ్రివచ్చి వివరించాడు! 'అతన్నితప్ప యింకో రిని వివాహం చేసుకోనంటోంది. ఆ పిల్ల' అని. శేఖరం లెక్క చెయ్యలేదు. ఆ పిల్లకొన్నిఏండ్లు పెళ్ళిచేసుకోలేదని వినికిడి.

చదువుకునే రోజుల్లో వనజ ప్రేమించి, వివాహం చేసు కోమని అర్థిస్తే శేఖరం నవ్వేశాడు. ఆమె కన్నీరుకార్చింది.

లత స్నేహితురాలు కమలను పెళ్ళి చేసుకోనంటే ఆమె మాట్లాడ్డమే మానేసింది.

తన్ను పెళ్ళిచేసుకోనన్న ఆమెను గురించి తనేమి చేయాలి! పెళ్ళికూతురు వనజ, కమల వారి క్రోధం, క్షోభ,

అసూయ, ఆవేదన తన్ను చుట్టుముట్టినట్లు బాధపడ్డాడు శేఖరం. ఈ పరిస్థితికి పరీక్షగా సత్యవతిరాక! శేఖరం యిల్లు చేరాడు.

సత్యవతి తలుపు తీసింది.

శేఖరం గబగబ రెండడుగులువేసి, మేజాసొరుగులోని కొన్ని కాగితాలు, ఫైల్సు తీసుకుని మళ్ళీ బయటికి బయలు దేరాడు.

'ఇదేనా మీ పరివర్తన'

రుసరుసలాడింది సత్యవతి.

'లేకపోతే ఏంచెయ్యమంటావు?'

'కోరి యింతదూరం మీకోసంవస్తే— మాటేనా లేకుండా వెళ్ళిపోవడం - న్యాయమేనా ?'

'నా పరిస్థితి బాగాలేదు- నా మనస్సు బాగులేదు. ఇంట్లో వుండలేను . . . బయట తిరగలేను ... ఆఫీసుకు పోలేను ...ఏం చేయాలో తోచక ఎక్కడికో పోతున్నాను.'

'అంత ఉపద్రవం ఏంవచ్చింది?'

'అది నీ కనవసరం.'

శేఖరం వెళ్ళిపోయాడు వీధిలోకి.

సత్యవతి నిర్ఘాంతపోయింది.

'ఏమండీ' కేకపెట్టింది సత్యవతి.

ఆ కేక ప్రతిధ్వనించి, ప్రక్క-యింటివారి పరిశీలనకు గురిమై, గాలిలో కలిసిపోయింది.

సత్యవతికి ఆత్మాభిమానం దెబ్బతింది. తాను ఎందుకు వచ్చినట్లు ?

అన్న, వదినె, పెట్టేబాధలు భరించలేక చచ్చిపోదామనుకుంది. చిన్నప్పుడే పెండ్లిఅయిన భర్త చనిపోవటంతో, తమకు బరువైపోయిందని సత్యవతిని వదినె దుమ్మెత్తిపోసేది. తల్లిమాట వినని కొడుకు సత్యవతి, భార్య మధ్య కొట్లాటలు చూస్తూ వూరకునేవాడు. తల్లి వోరిమి వహించి యింట్లో ఉండిపోయింది కొన్నాళ్ళు...

శేఖరం ఒకరోజు వచ్చాడు సత్యవతి అన్నగారిని కలుసుకుందుకు. అక్కడే బసచేశాడు. ఒక సాయంత్రం వదినె, సినిమాకు పోయింది. అన్నయ్యా ఆఫీసునుంచి యింకా రాలేదు. ఆ రోజల్లా శేఖరంతో గడిపింది. శేఖరం కబుర్లు చెప్పాడు. ఆమె కష్టాలు విని జాలి చూపాడు. ఇటువంటి కష్టాలు పడేకంటె పెళ్ళిచేసుకుని హాయిగా బ్రతకాలన్నాడు. తాను సాయం చేస్తానన్నాడు. అవసరమైతే తనే వివాహం చేసుకుంటానన్నాడు... సత్యవతి ఆనందించింది... చిన్న

ప్పుడు శేఖరాన్ని బాగా ఎరుగును... అతనంటే ఎక్కువ యిష్టపడేది... కాని మనస్సులోని కోరికలు ఈడేరలేదు... ప్రక్కవేసినప్పుడు కాఫీ యిచ్చినప్పుడు... సత్యవతి సిగ్గు పడింది... శేఖరం చుంబించాడు... సత్యవతి ఆ సన్నివేశం కోరింది, శేఖరాన్ని దగ్గరకు చేర్చింది. తియ్యటి మాటల్లో విషంలాంటి మాయ ఉంటుందనుకోలేదు— సత్యవతి గొల్లున ఏడ్చింది.

శేఖరం తిన్న కంచం వంటింట్లో ఖాళీగా ఉంది. నీళ్ళతో... కూర, అన్నం, గిన్నెలు మూలగాపడి ఉన్నాయి, అన్నం వండుకు తిందామనుకుంది. కాని మనస్కరించలేదు. రైలు ప్రయాణంలో నలిగిన దుస్తులు విడిచి, స్నానంచేసి, బరువుగా నిట్టూరుస్తూ పడుకుంది.

“శేఖరం మనస్సు ఎందుకు బాగులేదు!... ఏం కష్టాల్లో ఉన్నాడో, అడగడానికి బదులు తాను బలవంతపు అతిథిలా యింట్లో చొరబడడం సమంజసంగా లేదు అనుకుంది సత్యవతి. అయినా సాయంత్రం యింటికి వచ్చాక మనస్సు చల్లపరుచుకుని తనతో సాఫీగా మాట్లాడవచ్చని ఆశించింది ఆమె.

శేఖరం ఆఫీసులో అడుగుపెట్టాడు. ఆలస్యమయిందేమని ఆఫీసరు ప్రశ్నించాడు ముఖం చిట్లించి, తల ఒంచుకుని ఫైల్లు తీశాడు. రాశాడు... బుర్ర ఉపయోగించడంలేదు...

ఆ పనికి బుర్ర అనవసరం అని శేఖరం ధీమా... రోజూ చేసే పనే... ఎటొచ్చీ అక్షరాలు వేరు.

ఆఫీసులో పనిచేసే ఊర్మిళ పలకరించింది. ఎక్కడో చూస్తూ వెర్రి నవ్వు నవ్వాడు శేఖరం.

'ఈవేళ పరధ్యానం చిత్తగిస్తున్నారు. ఒక సిగరెట్టు కాల్చకూడదూ' సిగరెట్ల ఏజంటులా వూర్మిళ దగ్గరగా జేరి శేఖరం చెవిలో ఉరిమింది.

గడియారం టిక్కు టక్కుమని కదిలింది. అయిదు దాటింది.

శేఖరం బూట్లుకూడా టిక్కు టక్కుమంటూ బయటికి నడిచాయి.

ఇంటికి వెళ్ళాడు.

సత్యవతి నేలమీదపడుకుని దొర్లుతోంది ఏడుస్తూ.

'వచ్చావురా'

'రాక చస్తానా' శేఖరం అరిచాడు.

"నన్ను నిజంగా పొమ్మన్నారా... అయితే రైలు ఎక్కించండి" సత్యవతి బెదిరించింది.

శేఖరం సిద్ధమైనాడు.

సత్యవతి సంచీ పట్టుకుంది.

శేఖరం గుమ్మం వైపు నడిచాడు రైలు స్టేషనుకోసం.

సత్యవతి అతని ప్రవర్తనకు ఆశ్చర్యపోయింది.

"ఒక్కరాత్రి నన్నిక్కడ ఉండనివ్వరూ?" ప్రాధేయ పడింది.

"వీల్లేదు"

"మరి నన్ను ఎందుకు తీసుకొచ్చారు ఆ రోజు?"

"బుద్ధిలేక"

సత్యవతి గొల్లుమంది. సంచీ యింట్లోకి విసిరేసింది. మంచంమీద ఒరిగి ఏడ్చింది.

"మీకు వండి పెడతా" సత్యవతి లేచింది.

"నేను భోజనం చెయ్యను."

"ఎందుకు?"

"ఆకలిలేదు"

శేఖరం కర్కశత్వం విచిత్రంగా తోచింది. ఎప్పుడూ మందహాసంతో కనిపించే శేఖరం రాయిలా నిలుచుని మాట్లాడడం చాలా బాధ కలిగించింది.

సత్యవతికి కోపం వచ్చింది.

"నేను యీ యింట్లోంచి చచ్చినా కదలను" అరిచింది మూర్ఖంగా.

"నువ్వు కదలకపోతే- నేను కదలిపోతాను"

శేఖరం దుస్తులు మార్చుకున్నాడు.

వీధి వైపు బయలుదేరాడు.

"మీరు బయటికి వెళితే నేను చచ్చినంత ఒట్టు."

"మరీ మంచిది" శేఖరం రుసరుసలాడుతూ బయటికి వెళ్ళిపోయాడు.

సత్యవతి ఉక్రోషంతో తల తలుపునేసి కొట్టుకుంది.

ఆ శబ్దంవింటూ తన కేమీ సంబంధం లేదనట్టు నిష్క్రమించాడు శేఖరం.

సత్యవతిని ఆకలి దహించేస్తోంది.

గుండె మండిపోతోంది.

కళ్ళు దుఃఖంతో ఎర్రబడ్డాయి.

శేఖరం తత్వం అర్థంకాలేదు...

సత్యవతి మనస్సు సర్దుకుని, లేచి వంట చేసింది. చెల్లాచెదురుగాఉన్న యిల్లంతా శుభ్రం చేసింది. పుస్తకాలు, బట్టలు, అన్నీ పొందికగా అమర్చింది. కుర్చీలు, మేజాలు తుడిచింది. పక్కమీద క్రొత్త దుప్పటి పరిచింది. గడియారం చూసింది. రాత్రి తొమ్మిది దాటింది.

తలుపు చప్పుడైంది.

శేఖరం వచ్చాడు. సత్యవతి సంతోషించింది. తాను చేసిన వంట చూపించింది.

ఇల్లంతా అలంకరించబడి ఉంది,

శేఖరం పేలవంగా నవ్వాడు.

"ఇలా నన్ను ఆకర్షిద్దామనా ? ఈ జన్మలో యింక ఎవరూ నన్ను యింక ఆకర్షించలేరు !

చొక్కా విసిరేసి, వరండాలో చాప పరుచుకుని పిచ్చి పాటలు మొదలు పెట్టాడు.

సత్యవతికి అర్థమయింది శేఖరం త్రాగివచ్చాడని. ఆశ్చర్యం కలిగింది.

జాలిగా దగ్గరకు చేరింది.

శేఖరం ఆమెను గెంటేశాడు.

"శేఖరం !" అనునయంగా పిలిచింది సత్యవతి.

"చచ్చాడు" అరిచాడు శేఖరం.

మళ్ళీ అతని ఒడిలోకి చేరింది సత్యవతి.

ఆశగా ఆలింగనం చేసుకుంది.

బలవంతంగా నేలమీదకు తోసేశాడు శేఖరం.

సత్యవతి వదలకుండా గింజుకుంది- ఏడ్చింది. శేఖరం ఆమె చెంపపైన చెళ్ళున కొట్టాడు.

నీరసంలో ఉన్న సత్యవతికి కళ్లు తిరిగాయి.

ఒళ్ళు జలదరించింది.

ఉక్రోషం, అసూయ ఆమెలో తాండవించాయి. మనిషిలోని మోటు స్వభావం రెచ్చింది. శేఖరాన్ని అల్లరి పాలు చెయ్యాలనుకుంది కసిగా.

గొంతెత్తి ఏడ్చింది- కేక వేసింది- శేఖరం ఆ పరిస్థితి చూశాడు... వీధిలోకి నిష్క్రమించాడు. ఆమెవైపు ఏభయి రూపాయలు విసిరి "నా యింటోంచి తక్షణం ఫో" ఉరిమాడు శేఖరం, నిష్క్రమిస్తూ.

సత్యవతి కేకకు ప్రక్కయింటి జనం పోగయ్యారు. ప్రశ్నలకు సత్యవతి సమాధానం యివ్వలేదు ఏడ్వడం తప్ప.

కాస్సేపు గడిచాక తలుపులు మూసి వీధిలోకి నిష్క్రమించింది సత్యవతి.

రిక్షా ఎక్కింది...రిక్షా నడుస్తోంది.

వెన్నెల రాత్రి...

చల్లటి గాలి...

"ఎక్కడికి" అడిగాడు రిక్షావాడు...

"నడు..." సత్యవతి ముభావంగా మూలిగింది. తలకు కొంగు కప్పుకుంది పరదాగా... రిక్షాకు రెండు రూపాయలు యిచ్చి పంపింది.

బజారులో అరుగువార కూర్చుంది ఏడుస్తూ.

...వీధిలో ఏవో కూనిరాగాలు... పాటలు... తూలుతూ నడుస్తున్నాడు శేఖరం.

తన చుట్టూ వీధి పడుచులు అల్లరిగా నిలుచున్నారు... శేఖరం ఆ వైపు వచ్చాడు.

వీధి పడుచులు శేఖరం దగ్గరికి చేరారు...

'మీరు కాదు ఆ పిల్ల'

సత్యవతి మేలిముసుగు సవరించుకుంది — ముఖం కనిపించకుండా...

ఇద్దరు రిక్షా ఎక్కారు.

శేఖరం మితిమీరితాగిన మైకంలో తూలుతూ పేలుతున్నాడు...

దారిలో రిక్షానువదిలేశాడు... ఇద్దరూ నడుస్తున్నారు. ఒక సందులో-మలుపులో వెన్నెల నీడలో... ఇద్దరూ కలిసి పోయారు ...

శేఖరం మరుక్షణంలో మారిపోయాడు. ఆమె జ్ఞాపకం వచ్చింది... సత్యవతిని. తిట్టాడు... కొట్టాడు...

సత్యవతి ఏడ్చింది... అరిచింది...

డ్యూటీ పోలీలు గస్తీ కాస్తూ వాళ్ళని చూచాడు...

'ఏమిటని' ప్రశ్నించాడు.

శేఖరం తూలుతూ పేలాడు.

ఒక ఈలవ మరికొందరు పోలీసులు... ఒక కారు...

ఇద్దరికీ బేడీలు తగిలించాడు, బీటు పోలీసు.

అంతా చిత్రంగా తిరుగుతోంది. శేఖరం దృష్టిలో గింజుకున్నాడు శేఖరం.

పోలీసు లాటీతో నెత్తిమీద కొట్టాడు. శేఖరం ఒరిగిపోయాడు.

... ...

తెల్లవారింది... కిటికీ ఊచల్లోంచి సూర్యకిరణాలు తొంగిచూస్తున్నాయి. శేఖరానికి మెలకువ వచ్చింది. కళ్లు తెరవగానే ప్రక్కనే సత్యవతి.

ఎదురుగా జైలు గోడలు.

సత్యవతి కంటి కొలకుల్లో వేడి కన్నీరు నిలిచింది.

"నేను వెళ్ళిపోతాను శేఖరం! శిక్ష పూర్తయ్యాక."

శేఖరం నిశ్చేష్టుడై నిలుచుండిపోయాడు.

ఒక క్షణం నిశ్శబ్దం.

గత దినంనాటి పెళ్ళిబాజాలు చెవుల్లో గింగురు మన్నాయి.

"నా నుంచి మీరేమీ ఆశించకండి" ఆమె పకపక నవ్వు శేఖరం గుండెల్లో గునపం పోట్లు పొడిచింది!

★